# కిళ్లీ దుకాణం

మావూళ్ళో కోటయ్య కిళ్ళీకొట్టు చాలకాలంగా పేరు ప్రతిష్ఠల్ని పోషించుకుంటూ వస్తున్నది. కారా, జర్దా, మిఠాయి, పీటీకిళ్ళీలు కట్టడంలో కోటయ్య అందె వేసినచేయి. ఆ చుట్టుప్రక్కల పది పదిహేను గ్రామాలలో అంత ప్రఖ్యాతి వహించిన కిళ్ళీకొట్టు లేదంటే ఆశ్చర్యపడాల్సిన అగత్యం లేదు. ఒక్కసారి గనుక కోటయ్య కట్టిన కిళ్ళీ నమిలిచూస్తే— "కిళ్ళీ కట్టడంకూడా ఒక కళే!" అన్న అభిప్రాయం ఇట్టేకలుగుతుంది.

కోటయ్య సంపాదనాపరుడు. ఆ కిళ్ళీ కొట్టుపై దాదాపు పదేళ్ళలో మూడెకరాల సుక్షేత్రాన్ని సంపాదించాడు. రెండు వేలు పెట్టి ఇల్లు బాగుచేయించుకున్నాడు. మొదట్లో తాటా

కుల వసారా క్రింద ప్రారంభించిన పెట్టె దుకాణాన్ని పెద్దది చేసి రాతిగోడలతో, బంగాళా పెంకు కప్పు వేయించి. కంజాయింపుగా వుండేట్టు తయారుచేశాడు.

ఊరికి నడిబొడ్డున, నాలుగు రోడ్ల కూడలి ప్రక్క నున్నది ఆ కిళ్ళీకొట్టు. పేరుకు కిళ్ళీబడ్డీయే అయినా కోటయ్య ఆ కొట్లో సోడాలూ, అరటిపండ్లు, వేరుశనక్కాయలు, బెల్లపు జీడీలు, పంచదార బిళ్ళలు, బిస్కట్లు మొదలైన చిల్లర చిరు తిండి సరుకులు కూడా అమ్ముతూ వుంటాడు. అహర్నిశము పిల్లలు, పెద్దవాళ్ళు వస్తూపోతూనే వుంటారు. అంతే కాకుండా కొట్టుముందున్న బెంచీపై పదిమందివరకూ పనిలేని కుర్రకారు చేరి ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ, చర్చలు సాగిస్తూ సందడి చేస్తూనే వుంటారు. కిళ్ళీ కొట్టు ముందు అరటి తొక్కలూ, సిగరెట్టు పీకలూ, వేరుశనక్కాయల పొట్టూ, నానా చెత్తా చెదారమూ మహా గలీజుగా వుంటుంది. అయినప్పటికీ కోటయ్య చీపురు అరిగిపోతుందనే ఉద్దేశ్యంతో వూడ్చేవాడు కాదు. సర్కారు రోడ్డుగనుక ఆ రోడ్డుపైవున్న కల్మశం పంచాయతీ బోర్డుసొత్తు గనుక, దాన్ని ఆరోగ్య సిబ్బందివాళ్ళే శుభ్రం చేయాలని అంటూ వుంటాడు కోటయ్య.

ఒకరోజు సాయంత్రం నేను మా వూళ్ళోవుండగా, సిగరెట్టు కొనుక్కోవడానికి ఆ కిళ్ళీకొట్టు కేసి వెళ్ళాను. దాని ముందున్న అరటి తొక్కపై చూడక కాలువేసి జర్రున జారి

రోడ్డు మధ్యలో మొహం దూర్చబోయాను. అక్కడ జేరిన సూచకులంతా పళ్ళు యికిలించారు. నాకు చిర చిర లాడింది.

"ఏమయ్యోయ్ కోటయ్యా! నీకామాత్రం సివిక్ సెన్సు లేదా! కొట్టు ముందు రోడ్డుమీద అరటితొక్కల్ని వేయిస్తూ, జారిపడే వాళ్ళనుచూచి పదిమంది చేతా నవ్విస్తావా! ఆ మాత్రం సామాన్య జ్ఞానం నీకు లేకపోయిందా! నీ కొట్టుముందు పరిశుభ్రత పట్ల నువ్వు జాగ్రత్త తీసికోనక్కర్లేదూ! పౌరునిగా ఆ మాత్రం బాధ్యత వహించకపోతే నీకు వ్యాపారం దేనికి!" అన్నాను కటువుగా.

"క్షమించండి బాబూ! తప్పునాదే! రేపట్నుంచీ కొట్టుముందు అద్దంలా వుండేట్టు చేస్తాను. బుద్ధిగడ్డితిన్నది" అంటూ కోటయ్యసాష్టాంగ ప్రమాణం చేయడానికి సిద్ధపడ్డాడు. మరి బ్రతుక నేర్చిన వాడాయె!

తర్వాత పదిహేను రోజులకు మా వూరెళ్ళి సోడా త్రాగడానికి కోటయ్య కిళ్ళీకొట్టు కెళ్ళినప్పుడు- ఆ కొట్టు ముందున్న పరిశుభ్రతకు ఆశ్చర్య చకితుణ్ణయ్యాను. ఒక్క అరటి తొక్క లేదు. పై పెచ్చు ఆ తొక్కల్ని భద్రపర్చడానికి ఓ ఇనుపతొట్టి కొట్టు పక్కన ఏర్పాటు చేయబడివుంది, అరటి పండ్లుతినే వాళ్ళందరినీ ఆజ్ఞాపిస్తున్నాడు — ఆ తొక్కల్ని ఆ తొట్టెలో పడవేయమని, ఒక బోర్డుకూడా కట్టాడు- అక్కడ అరటి పండ్లు తినేవారికి హెచ్చరికగా. అంతే గాక-

వెళ్ళి ఆ తొట్టె చుట్టు ప్రక్కలున్న తొక్కల్నికూడా నామోషీ లేకుండా ఏరుకొచ్చి ఆ ఇనుపతొట్టెలో వేస్తున్నాడు. నేను క్రితంసారి వచ్చినప్పుడు కోపంతో అన్న మాటలు బాగా పని చేశాయనుకున్నాను. మనస్సులో పొంగిపోయాను. కోటయ్య మంచితనానికి అభినందనలు తెలియబరచాను. ఊళ్ళో ప్రతి వ్యక్తీ శుచీ శుభ్రతను గురించీ, తమ బాధ్యతను గురించీ ఆ మాత్రం తెలుసుకుంటే గ్రామంలో రోడ్లు యింత అసహ్యంగా అనారోగ్యకరంగా ఎందుకుంటాయి! అనుకున్నాను.

సోడా త్రాగి, కిళ్ళీ వేసికొని అలా బయలు దేరగానే అక్కడున్న నా మిత్రు డొకాయన ఆందాకా నాతో వచ్చి, "కోటయ్య తెలివి తక్కువ వాడేంకాదు! గ్రామ స్వాస్థ్యం పట్ల అతనికి మక్కువేం లేదు! ఎదురుగా వీధిలోవున్న పాల వ్యాపారి రామయ్య తన ఖర్చుతో ఆ ఇనుపతొట్టిని అక్కడ ఏర్పాటు చేశాడు. రోజూ ఆ తొక్కల్ని రామయ్య తీసికెళ్ళి తన ఆవులకు మేపుతూంటాడు. ఆ తొట్టి అక్కడ వుంచినందుకూ, తొక్కల్ని ప్రోగుజేసినందుకూ కోటయ్యకు నెలకు మూడు రూపాయలిస్తూవుంటాడా పాలవ్యాపారి రామయ్య" అన్నాడు.